# ఆంకట్ట

ఆంకట్టను[1] జూస్తాంటే దాంట్లో కుండలుగాల్చడం, కుండలుగాల్నాక ఆము[2] తీస్తానే పిల్లోళ్ళందరూ మసిబూసుకుంటా కుండలూ, ముంతలూ, గురుగుల్ను కుమ్మర సుబ్బయ్య తాత ఇంట్లోకి మొయ్యడం .... అయన్నీ గ్యాపకమొస్తాయి. బల్లో నుంచీ ఇంటికొస్తానే కుమ్మర్తాత ఆము పెడ్తా వుండాడంటే ఎగుల్లేసేవాళ్ళు. సుబ్బయ్య కోళ్ళూ కొడుకుతో పాటు ఎండపెట్న పచ్చి కుండల్ను ఆముకాడికి మోస్తే ఆ తాత వాట్ని వొర్సలొర్సలుగా బేర్సుకొనేవాడు. ఆ మొయిన అంతకుముందు ఏట్లో తిరిగి రాగోలు మీదేసుకోని తెచ్చిన కంపను ఆములో యేసి తొక్కి ఆము కప్పుతాడు. కప్పినాంక ముందు దిక్కున దానికి సిన్న వాకిలిబెట్టి దాని గుండా రాగోల్తో కంప దురముతా వుంటాడు. లోపల మంట ఆమంతా రగులుకొంటా వుంటాది.

ఆముకాలేతప్పుడు వాళ్ళ అమ్మగార్లు బువ్వతిందురాండని పిల్చుతాన్నా పిల్లోళ్ళు అన్నుంచీ పోనేపోరు. సుబ్బయ్యతాత కంప దురముతా వుండేదీ, ఆములో మంట ఎర్రగా మండుతా వుండేదీ, దానిపైన పెట్టిన సిన్న గవాసిగుండా[3] రేగులు ఎగుర్తా సీకట్లో మినుగురు పురుగులాల ఆడ్తా వుండేదీ సూస్తావుంటారు. తాత కోళ్ళు ఎల్లమ్మ, తాతకు ఆడికే బువ్వ తీసుకొస్తాది. మామ బువ్వ తినేతప్పుడు ఆమే కంప ఆములోకి తోస్తాది, మంటలు బాగా అందుకోని లోపల బెట్న కంప అంటుకొన్నాక బయట కంపతో అంతగా పనుండదు. అప్పటికి ఆదలా బాదలా ఇండ్లకు బోయి బువ్వ తినొచ్చిన పిల్లోళ్ళకు మెల్లంగా తాత కతలు జెప్తాడు. మాట మునిగినాగ్గానీ వాళ్ళు ఇండ్లకు బోరు.

రొండ్రోజులయినాక ఆము తీస్తే కుండలు కాల్న వాసన బలే వుంటాది. ఆము బాగ కాలిందా లేదా అని సుబ్బయ్య తాతను అందరూ యిశారిస్తారు. ఒక్కొక్కసారి పచ్చి కంప వుంటేనో, యింగేదన్నా వాటం తప్పుతేనో కుండలు బాగా కాలవు, శానా వోటుబడిపోతాయి. ఆము సెడిపోయిందంటే సుబ్బయ్య తాత దిగులుపడ్తాడు. సేసిన కట్టమంతా వోటిదయిపోయింది అనుకొంటా వుంటాడు. ఆడోళ్ళకు కానుపు ఎట్టాదిదో, కుమ్మరోనికి ఆము అట్టాటిది అంటా వుంటాడు ఆ తాత. అంటే, అంత గండమంట! ఆములో సిన్న కుండలూ, కడవలే గాదు, సారెమీన గాకండ సేసేవాడలూ, బానలూ, పొయ్యిలూ అట్టాటియీ వుంటాయి. పదుంబట్టే[4] వాడ జెయ్యాల్నంటే మూన్నాలుగు రోజుల పని ! అట్టాటియి సెడిపోతే దిగులే గదా మల్ల !

మన్ను పాకం జేసుకోడానికని, మంటిగుంతలో మన్ను తొక్కేది బలే వుంటాది. సుబ్బయ్య తాత కొడుకు సుబ్బరాయుడు సారె తిప్పుతాంటే, ఆ తాత సారె మీంద వొంగబడి రొండు సేతుల్తో, పాకానికొచ్చిన మన్నును నీళ్ళు జల్లుకొంటా, వొత్తుకుంటా, బట్టతో కోసుకుంటా ఆకారం తీర్సుకుంటా వస్తాడు. సారె గెన్నున తిరుగుతా వుంటే దాని మీనుండే సిన్న బద్దిలో కట్టె ఎట్ట యేస్తాడో యిసిత్రమయితాది. కండ్లు నిలిపి యెంతసేపు సూసినా కనపడన్ది, సుబ్బరాయుడు సూడకుండానే కనిపెడ్తాడు. సారె మీంది పని అయినాక సుబ్బయ్య తాత దాన్ని వొళ్ళో పెట్టుకోని, సలపతో[5] అడుగు జేసుకోడం, గట్టిపర్సడం జేస్తాడు. అవతల ఆరబెట్టాడు. రొంత ఆర్నాక ... కావాల్నకుంటే కడవలకో, వాడలకో పూజలు[6] యేస్తాడు. సుబ్బయ్య తాత గుర్రాలూ, ఏనిగలూ, ఎద్దులూ యిట్టాటి బొమ్మల్ని మాంచి సిత్తారి పన్తో సేస్తాడు.

ఊళ్ళో రొంత పెద్దోళ్ళు పెండ్లి జేసుకొంటే గినా, సుబ్బయ్య తాత నాగమల్లె కుండలకు వొచ్చేవాళ్ళు.

---

1) ఆవం వుండే ప్రదేశం 2) ఆవం 3) గవాక్షం 4) అయిదు తూములు
5) కుండ తయారీలో వాడే పరికరం 6) డిజైన్

నాగమల్లె కుండల్ను పెతేక సేతాళంతో సేసేవాడు. అయిరేని కడవకైతే రంగులేసేవాడు. పెండ్లోళ్ళు ఉల్లెడ పట్టుకోని నాగమల్లె కుండలకు వొచ్చినప్పుడు సుబ్బయ్య తాతకు తాంబూలం ఇచ్చి గౌరువం సేసేవాళ్ళు. అప్పుడు తాత నెత్తికి రుమాలు సుట్టుకోని, నొసిటికి కుంకంబొట్టు పెట్టుకోని బలే వుండేవాడు.

సుబ్బయ్య తాత నాయిన నాగయ్య కూడా కుమ్మరిపన్లోనూ, వంటల్లోనూ మాంచిపనోడంట. నాగయ్య అయాంలో, ఆయిన కుండనొత్తే పని పట్టుకొంటే, కొడుకు సుబ్బయ్య సారె తిప్పుతా వచ్చినాడు. నాగయ్య సేసిన పని సుబ్బయ్య సేతికొస్తే, సారె తిప్పే పని ఆయిన కొడుకు సుబ్బరాయునికొచ్చింది. అట్నే ... పెండ్లి వంటల్లో కూడా నాయినలకు కొడుకులు తోడుపద్దా వచ్చినారు. ఇట్లా ఎన్నో తరాలుగా వచ్చిన వర్స సుబ్బరాయునికాడికొచ్చి నిల్చిపోయింది. కాపోడు మట్టి నుంచీ బంగారు తీస్తే, కుమ్మరోడు మట్టినే బంగారు సేస్తాడనే సుబ్బయ్య తాతకు తను సూస్తా వుండగానే, బంగారు సేయడమట్టబోనిచ్చి బతుకు తెరువే వుండదని తెలకపోయింది. పెండ్లిండ్లళ్ళో వంటకు పిల్చకపోతే పోయిర్లే నేనూ ముసిలోనైపోతి, గాడిపొయ్యి వంటలు సేయలేను అనుకొన్నాడు. అదే మట్టితో, అదే పన్తనంతో సేస్తా వుండే కుండలు గొనేవాళ్ళే ల్యాకపోయిరి ! మట్టి మార్లా, దాని గునం మార్లా మనిసి మారిపోయినాడు ! ఊళ్ళో ఎవురింట్లో సూసినా టీలు సామాను ! టీలు సామాను మంచిది గాదు, మట్టి కుండ వాద్దే సలవ, దాంట్లో వొండిన కూరాకు తింటే ఆరోగ్గెం అని సెప్పినా యెవురూ యిన్లా. కుమ్మరోని మాన్యం రొండెకరాలేగాక, కొనుక్కున్న నాలుగెకరాల కోళ్ళసేను గూడా అప్పుల్లోకి పోయింది. సుబ్బయ్య తాత నడుంవొంగిన ముసిలోడైనాడు.

కోళ్ళూ కొడుకూ సెప్పినా యినకుండా కుండలు సేస్తానేవుంటాడు. గంప తీసుకోని ఏట్లోకి పోయి మన్ను తోగి తెచ్చుకోని, తొక్కి, సారె మీదికెక్కిస్తాడు. సుబ్బరాయుడు సేసేది ల్యాక సచ్చుపడిన సేతుల్తో సారె తిప్పుతాడు. అట్టా కుండలు, కడవలు, వాడలు సేసి మిద్దెత్తున బేర్సినాడు సుబ్బయ్య తాత. బొత్తిగా సేయడానికి వోపిక లేనప్పుడు కుక్కిమంచమేసుకోని బేర్సి పెట్టిన వాటిదిక్కు సూస్తా వుంటాడు. ఆంకట్టకాడికి బోయి ఆడ కూచ్చోని పుల్ల తీసుకోని కుల్లగిస్తా వుంటాడు.

ఎప్పుడన్నా యే పలాస్తరం[7] వొచ్చినోళ్ళో, టీలు సామాను కొనలేని బీదోళ్ళో కుండో కడవో అడుగుతే, సుబ్బయ్య తాత అలివిగాని ధర సెప్పేవాడు. 'అంతా !' అంటే, కోపగిచ్చుకోని గొనుక్కుంటా, "అంతదైతే టీలుదానికి ఎంత లెక్కిస్తావు దానికంటే యిది తక్కువ కాదా" యిట్ట తకరారు పెట్టుకునేవాడు. 'ఆ ముసిలోని కెక్కల్లేని ఆశలే' అని గూడా అడగడం మానుకొన్రి. సుబ్బయ్య తాతకు యింగా గుబులెక్కువాయె. కొడుకూ, కోళ్ళూ గూడా ఆ ముసిలోని సంగతి యిడ్సిపెట్రి. ఒకనాడు కొడుకూ కోడలూ యాదో పనికిపోయి వచ్చి సూసేతలికి ... యింగేముంది ?

మిద్దెత్తునా బేర్సిపెట్టిన కుండల్నూ, కడవల్నన్నిట్నీ కట్టె తీసుకోని నుగ్గునుగ్గుగా కొట్టి కుక్కిమంచంలో పడుకోనుండాడు సుబ్బయ్య తాత ! కుమ్మరోనికొక ఏటి పని, గుడె కొక పూట పని అయింది ! అప్పుడు సుబ్బరాయుడేమన్నాడో, సుబ్బయ్య తాత యేమన్నాడో గానీ యిప్పుడిద్దరూ లేరు. సుబ్బరాయుని కొడుకులు యాదో పనిజేసుకొంటా వుండారు. కుమ్మరి పనిగాదు, అసలు వాళ్ళకు ఆ పనే రాదు.

ఆంకట్ట మాత్రం యింగా అట్టనే వుంది. దాన్దగ్గెర కూకోని, సుబ్బయ్య తాత సేసినట్టు పుల్లతో కుల్లగిస్తే ఎంత లోతున కుల్లగిచ్చినా నల్లని మసి వొస్తానే వుంటాది. అంతేగాదు ... అది లోతుకు పోనుపోనూ యింగా నల్లగా, మెత్తగా తడిగా ... సుబ్బయ్య తాతగుండెకాయను పొడిస్తే సిక్కని నెత్తర కక్కుతా వున్నెట్టుంటాది.

7) పరస్థలం